జనగామ

బుధవారం 19 ఫిబ్రవరి 2025
WEDNESDAY, FEBRUARY 19, 2025

ఎండిపోయిన పొలంలో గేదెను మేపుతున్న రైతు బండి ఉప్పలయ్య

సాగునీరు లేక ఎండుతున్న వరి పొలాలు

రామరాజుపల్లిలో రైతుల అరిగోస

దేవరుప్పుల, ఫిబ్రవరి 18: యాసంగి సీజన్‌లో వరికి సాగునీరందక ఎండి పోతున్న దుస్థితి మండలంలోని పలు గ్రామాల్లో నెలకొంది. దేవాదుల రిజర్వా యర్ల ద్వారా గతంలో సాగునీరు అందగా రెండు పంటలు పండాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గోదావరి నదిలో నీళ్లున్నా రిజర్వాయర్ల నుంచి మండ లంలోని ఆయా గ్రామాల కాల్వలకు విడుదల చేయడం లేదు. ఓ వైపు చెరు వుల్లో నీరు లేక, మరోవైపు దేవాదుల కాల్వ నుంచి నీరు రాక వరి పొలాలు ఎండి పోతున్నాయి. భూగర్భ జలాలు సైతం అడుగంటడంతో బోర్ల నుంచి తగినంత నీరు రావడం లేదని రైతులు చెబుతున్నారు. రామరాజుపల్లిలో రైతు బండి ఉప్ప లయ్య తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేయగా నీరు అందడం లేదు. దీంతో వరి చేను ఎండిపోతుండడంతో చేసేదేమి లేక గేదెలను మేపుతున్నట్లు బాధిత రైతు వాపోయాడు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక రైతుల సమస్య లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బీఆర్ఎస్ పాలనలో ఏటా రెండు పంటలకు దేవాదుల రిజర్వాయర్ల ద్వారా అందేదని, ఇప్పుడు ప్రభుత్వం మా బాధలు పట్టించుకోవడం లేదన్నారు.

రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న సీపీఎం నాయకులు

బాణాపురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 18 : జనగామ పట్టణంలోని బాణాపురం వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 26 రోజులకు చేరాయి. మంగళవారం దీక్షలను ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షురాలు లింగాల సుగుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణా పురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయకుంటే ఈ ప్రాంత ప్రజలతో పాటు ఆ మార్గంలో ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలందరూ రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అక్కడ అండర్ పాస్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలంద రితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, కొండ వరలక్ష్మి, ఎండీ బిస్మిల్లా, మేడ నాగమణి, రమ, మానస, తిప్పారపు తులసి, గూడ విజయ, తిమోతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘనపురం, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయురాలి పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ స్పెషలాఫీసర్ అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తాత్కాలిక పద్ధతిలో బోధించేం దుకు బీఎస్సీ (మ్యాథ్స్), బీఈడీ అర్హతగల అభ్యర్థులు బుధవారం పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 8179985886లో సంప్రదించాలన్నారు.

సిద్ధేశ్వరాలయ చరిత్రపై సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిద్ధులగుట్ట వైభవంపై సంకలనం ఆవిష్కరణ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయ చరిత్ర, స్వామివారి మహత్యంపై రూపొందించిన సంకలాన్ని మంగళ వారం ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ప్రాంగ ణంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో విశ్లేషణాత్మక పరిశోధన వ్యాసాలను ఇందులో పొందుపర్చామన్నారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్, నర్మెట సీఐ అబ్బ య్య, స్థానిక ఎస్సై హమీద్, ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈవో వంశీ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కొత్తపల్లి రాజయ్య, బాలరాజు, హర్షవ ర్ధన్, రాజేశ్వర్‌భార్గవ, పోచన్న, సురేశ్, సదాశివ, ఝాన్సీ, పంచాయతీ కార్య దర్శి రూపాచైతన్య , అర్చకులు ఓంనమశివాయ, సదాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

24 నుంచి సిద్ధులగుట్ట బ్రహ్మోత్సవాలు

కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వ హించే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో మల్లికార్జున్ పిలుపు ఇచ్చారు. మంగళవారం కొడవటూరులో దేవా దాయ శాఖ అధికారులు, పాలకమండలి చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలను దిగ్విజయం చేసేలా అందరూ కృషి చేయాలని కోరారు. జాతర ప్రదేశంలో తాగునీరు, లైటింగ్ సౌక ర్యాలు కల్పించాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం
- హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 18 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీ ఎస్) శాంతికుమారి అన్నారు. గ్రామాల్లో పంటల సాగుకు కరెంట్ కోతలు లేకుండా చూడాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌తో ఆమె వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి రేషన్ కార్డు దరఖాస్తుల ధ్రువీకరణ, రైతుభరోసా పథ కాల అమలుపై చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, సాగు నీటికి, నిర్మాణ రంగానికి అవసరమైన నీటితో పాటు వినియో గదారుల డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా అమలు చేస్తున్నామని పేర్కొ న్నారు. రేషన్ కార్డు దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే లబ్ధిదారులకు కార్డులు జారీ చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా నిరంతరం పర్యవేక్షణతో పాటు ఆయా పాఠశాలల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యా ర్థులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో రామారావు నాయక్, డీఎం హతీరాం, మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, ఎన్పీడీసీ ఎల్ ఎస్ఈ వేణుమాధవ్, మండల ప్రత్యేక అధికా రులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు : కలెక్టర్

భ్రూణ (గర్భస్థ శిశువు) హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. 'బేటీ బచావో–బేటీ పడావో' పథకం అమల్లోకి తెచ్చి పదేళ్లవుతున్న సందర్భంగా మంగళ వారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మహి ళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షే మశాఖ ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ 1994పై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, విశిష్ట అతిథిగా వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్రనాయక్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడబిడ్డల పట్ల తల్లిదండ్రులు, సమాజం వివక్ష చూపొద్దన్నారు. పురుషులతో పాటు సమానంగా ఆడబిడ్డలను గౌరవించా లని ఆయన కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తారని ఆయన స్పష్టం చేశారు. దీనికి సహకరించిన వారికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తా రన్నారు. ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్లలో అవ గాహన కల్పించేలా ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయా లన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098లో సంప్రదించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారికి రూ.10 వేలు నజ రానా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ శారద, ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్ఎంపీలు

ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 18 : ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బండారి ఆంజనేయులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆర్ఎంపీ, పీఎంపీల ధర్నాకు మండలం నుంచి గ్రామీణ వైద్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లా డుతూ ఆర్ఎంపీల, పీఎంపీలపై దాడులను అరికట్టాలని కోరారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించి ప్రజలకు వైద్య సేవలందేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్య దర్శి రాపెల్లి చక్రపాణి, కోశాధికారి మహేశ్, సభ్యులు భాస్కర్, కనకయ్య, రాజు పాల్గొన్నారు.

కోనాయిచలంలో రూ.3 లక్షల స్త్రీనిధి రుణాలు స్వాహా

కోనాయిచలంలో విచారణ జరుపుతున్న ఏపీఎం రవీందర్

జఫర్‌గడ్, ఫిబ్రవరి 18 : మండలం లోని కోనాయిచలం సంతోషిమాత స్వ యం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)లో రూ.3 లక్షల స్త్రీనిధి రుణాల్లో అవకతవ కలు చోటు చేసుకున్నాయి. రుణాల రిక వరీ కోసం మంగళవారం కోనాయిచలం గ్రామానికి వెళ్లిన అధికారుల సమక్షంలో ఈ విషయం బహిర్గతమైంది. ఏపీఎం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనాయిచలం సం తోషిమాత ఎస్‌హెచ్‌జీ సభ్యులకు స్టేషన్ ఘన్‌పూర్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ద్వారా 2018 జూన్ 18వ తేదీన రూ.4 లక్షల స్త్రీనిధి రుణాలు మంజూరయ్యాయి. గ్రూపు సభ్యులకు రూ.లక్ష రుణాలు పంపిణీ చేసి, మిగతా రూ.3 లక్ష లను సంఘ సభ్యులకు తెలియకుండా విలేజ్ ఆర్గనై జేషన్ అసిస్టెంట్ (వీవోఏ) స్వాతితో పాటు గతంలో స్వర్ణ భారతి మండల సమాఖ్య ఏపీఎంగా పనిచేసిన సత్యనారాయణ కలిసి తీసుకున్నట్లు తెలిపారు. సం ఘ సభ్యులు తీసుకున్న రూ.4 లక్షల రుణం 2018 నుంచి ఇప్పటి వరకు సభ్యులు చెల్లించలేదు. ఇది పెండింగ్‌లో ఉంచడంతో రికవరీ కోసం వెళ్లిన సంద ర్భంగా వెలుగు చూసిందని రవీందర్ పేర్కొన్నారు. గతంలో పనిచేసిన ఏపీఎం సత్యనారాయణ, వీవోఏ స్వాతిపై సంఘ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నివే దికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే సమయంలో వీవోఏలకు, ప్రైవేట్ వ్యక్తులకు డబ్బులివ్వకుండా బ్యాంకు లో జమ చేయాలని రవీందర్ సూచించారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

గురుకుల పాఠశాల తనిఖీలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్‌లోని సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో వంటలను పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 18 : మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించా లని, నాణ్యమైన ఆహారం ఇవ్వాలని అద నపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మంగ ళవారం డివిజన్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్య తను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం విద్యార్థులకు ఆహారం అందిస్తు న్నారా, సరైన సమయానికి భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్య తో పాటు ఆరోగ్యం చాలా ముఖ్యమని రోహిత్‌సింగ్ అన్నా రు. టెన్త్ వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధిం చేలా, ఇంటర్‌లో అత్యధిక మార్కులతోపాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ప్రిన్సిపాల్ కృత మూర్తికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

టెన్త్‌లో 10 జీపీఏ సాధించాలి

జఫర్‌గడ్ : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి విద్యార్థి 10 జీపీఏ సాధించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, వంట గది, స్టోర్ రూమ్‌లో నిల్వ చేసిన కూరగాయలు, పప్పు లు, కోడిగుడ్లను పరిశీలించారు. పింకేశ్‌కుమార్ మాట్లా డుతూ విద్యార్థులు భోజనం చేసే డైనింగ్ హాల్, వంట గది, స్టోర్ రూమ్, డార్మెటరీ, టాయిలెట్స్‌ను పరిశు భ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థు లకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఎంపీ డీవో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

జనగామలో ఆందోళన చేస్తున్న వామపక్షాల కార్యకర్తలు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 18 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడా పారి శ్రామిక వేత్తలు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని పేర్కొంటూ సీపీఎం, సీపీఐ కార్యకర్తలు మంగళవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద ఆందోళన నిర్వహించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్ర ణలో ప్రధాని మోదీ విఫలయ్యారని నిర సన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న మాట్లాడారు. కరోనాతో దేశంలోని ప్రజల జీవనం, ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నాయని తెలిపారు. పెరి గిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు ఇబ్బంది పడు తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరికీ విద్య, వైద్యాన్ని ఉచి తంగా అందించాలని వారు డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, కార్మికులకు రక్షణ చట్టాలు, నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోయిందని తెలిపారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మహిళల అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శిం చారు. ఇప్పటికైనా కేంద్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు జోగు ప్రకాశ్, సొప్పరి సోమయ్య, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, గోపి, శేఖర్, విజేందర్, ఐలయ్య, మధు, బెజగం చం ద్రయ్య, జయకృష్ణ, వెంకట్‌రెడ్డి, వెంకటమల్లయ్య, మీట్యా నాయక్, సుమ ఆర్య, కనకాచారి, సుగుణ, బీ రయ్య, ఆనందం, మహేందర్, సుధాకర్, సౌందర్య, ఉపేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

లింగాలఘనపురం, ఫిబ్రవరి 18 : తెలం గాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్‌ను మండలంలోని పార్టీ నాయ కులు సోమవారం రాత్రి ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో కలిశారు. కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథ కాలు అమలయ్యాయని, కాం గ్రెస్ అధికా రంలోకి వచ్చాక ప్రజలు సమస్యలతో సత మతమవుతున్నారని అన్నారు. నాయకులు గట్టగల్ల శ్రీహరి, ఉడుగుల భాగ్యలక్ష్మి, మ బ్బు కరుణాకర్, రాహుల్ పాల్గొన్నారు.

శివకల్యాణానికి విరాళం

బచ్చన్నపేట, ఫిబ్రవరి, 18 : మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి రోజు జరిగే శివ కల్యాణం వేడుకలకు ముది రాజ్ సంఘం నుంచి రూ.5,111 విరాళం గా ప్రకటించారు. ఈ మేరకు నగదును మం గళవారం శివాలయ నిర్వాహకులకు ముది రాజ్ సంఘం నాయకులు అందించారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

పాలకుర్తి, ఫిబ్రవరి 18: మొగల్ సామ్రాజ్యాన్ని గడ గడలాడించిన ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని విగ్రహ క మిటీ అధ్యక్షుడు రేగుల నరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాసాల మహేశ్ కోరారు. మంగళవారం వారు విలేకరు లతో మాట్లాడారు. ఈ నెల 19న దర్దేపల్లిలో సాయం త్రం 5 గంటలకు శివాజీ విగ్రహావిష్కరణ ఉంటుంద న్నారు. అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాప కుడు తక్కళ్లపల్లి రవీంద్ర హాజరవుతారని చెప్పారు.

తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు తీసుకోవాలి

డీఎల్‌పీవో టీ వెంకట్‌రెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 18 : వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్ర త్తలు చేపట్టాలని డీఎల్‌పీవో టీ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇప్పగూడెం గ్రామ పంచాయతీని సందర్శించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా అవసరమైనచోట బోర్ల మరమ్మతులు చేపట్టాలని, నీరు వృథా కాకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో మార్చి చివరి నాటికి వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. షెగ్రిగేషన్ షెడ్లలో వర్మి కంపోస్ట్ ఉత్పత్తిని పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 18 : పంటలను ధ్వంసం చేసిన వ్యక్తిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని బాధి తుడు రాజుకు పరిహారం ఇప్పించాలని పలువురు సంబం ధిత అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని అక్కపల్లిగూడెంలో స్థానికులు మెడిద భూపాల్, యార కొమురెల్లి, సంజీవ, లింగనబోయిన ఎర్రన్న, సోమిరెడ్డి విలే కరులతో మాట్లాడారు. అక్కపల్లిగూడేనికి చెందిన యార రాజు ఇదే గ్రామానికి చెందిన పగిడిపల్లి గోపయ్య వద్ద నాలుగేళ్ల క్రితం రూ.60 లక్షలతో నాలుగు ఎకరాల వ్యవ సాయ భూమిని కొనుగోలు చేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన పగిడిపల్లి ఎల్లయ్య గౌడ్ సైతం గోపయ్య వద్ద రెండు సర్వే నంబర్లలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడన్నారు. గోపయ్య మృతి చెం దాక రాజు సర్వే నంబర్‌లో తనకు ఆర ఎకరం భూమి ఉందని చెబుతూ ఈ నెల 14న రాత్రి మక్కజొన్న, పొగాకు పంటలను ఎల్లయ్య ధ్వంసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజు సర్వే నంబర్‌లో భూమి ఉంటే పంట వేయక ముందు లేదా కోసిన తర్వాత మాట్లాడి పరిష్కరించుకుంటే బాగుండేదన్నారు. కానీ పంటను ధ్వంసం చేయడంతో సుమారు రూ.3 లక్షల వరకు రాజు నష్టపోయాడని వారు తెలిపారు. దీనికి కారణమైన ఎల్లయ్య పరిహారం చెల్లించా లని వారు డిమాండ్ చేశారు. పంట ధ్వంసానికి వినియో గించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఈ సమావేశంలో అను మాల నాగరాజు, మెడిద బుచ్చిరెడ్డి, సత్తయ్య, జన్నయ్య, కుమార్, ఏలియా, యాకమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పాలకుర్తి బస్టాండ్‌లో వ్యక్తి మృతి

పాలకుర్తి, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుండెపోటుతో ఒకరు మృతి చెందారు. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్ర కారం...మండలంలోని వావిలాల గ్రామా నికి చెందిన ఎండీ ఖాజాపాషా(46) వెల్డిం గ్ షాప్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పని షాప్‌లో ముగించుకుని బస్టాండ్‌లోకి వెళ్లాడు. ఛాతినొప్పితో బాధప డుతూ బస్టాండ్ బెంచిపై నిద్రించి గుండెపో టుతో మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫకీర్ అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సౌమ్యమిశ్రా

సబ్ జైలును తనిఖీ చేసిన జైళ్ల శాఖ డీజీ

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 18 : జిల్లా కేంద్రంలోని సబ్ జైలును మంగ ళవారం రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా తనిఖీ చేశారు. జైలులోని మహాత్మాగాంధీ విగ్రహానికి వరంగల్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ సంపత్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఖైదీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. క్షణి కావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకొని సమాజంలో కొత్త జీవితం ప్రారం భించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ రామకృష్ణ, అర్బన్ సీఐ దామోదర్ రెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నేడు సేవాలాల్ జయంతి వేడుకలు

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 18 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను బుధవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో డివిజన్ కేంద్రంలో నిర్వహించే వేడుకల ఏర్పాట్లను ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఉత్సవ కమిటీ కన్వీనర్, డీఆర్డీవో వసంత మంగళవారం పరిశీలించారు. శివునిపల్లిలోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో ని ర్వహించే సమావేశానికి సంబంధించి వారు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు సతీశ్, శ్రీకాంత్, గిరిజన సంఘం నాయకులు రాజేశ్‌నాయక్, కొర్ర వెంకటేశ్‌నాయక్, స్వామినాయక్, లకావత్ చిరంజీవి, రమేశ్, శ్రీను, హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు.

చిందు కళాకారులను సన్మానిస్తున్న అరూరి సుధాకర్, గడ్డం సమ్మయ్య

గ్రామీణ కళలను భవిష్యత్‌తరాలకు అందించాలి

పాలకుర్తి, ఫిబ్రవరి 18: చిందు యక్షగానం, భాగవతం, చిరుతల రామా యణం వంటి గ్రామీణ కళలను పరిరక్షించడంతోపాటు భవిష్యత్ తరాలకు అందించాలని డాక్టర్ అరూరి సుధాకర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మ య్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సుధా పాఠశాలలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో చిందు యక్షగాన నాటకోత్సవాలను నిర్వహించారు. కళాకారులను సన్మానించారు. అతిథులు మాట్లాడుతూ చిందు కళాకారులు కళలకు జీవం పోస్తున్నారన్నారు. యక్షగాన కళారూపాలు ఎంతో మందికి జీవనోపాధిని అందించడంతో పాటు ప్రజలకు విజ్ఞానం, వినోదాన్ని అందిస్తున్నాయన్నారు. కళాకారులు గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ, రఘు పతి, సోమరాజు బృందాలు కళారూపాలు ప్రదర్శించాయి.

శిక్షణ పొందిన విద్యార్థులతో ఇన్ఫోసిస్ అధినేత గోపాల్

సీజేఐటీలో ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణ

జనగామ రూరల్, ఫిబ్రవరి 18 : మండలంలోని యశ్వంతాపూర్‌లోని క్రీస్తు జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు చెందిన ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది ఉత్తమ విద్యార్థులను గుర్తించి వారికి అడ్వాన్స్ టెక్నాలజీలైన ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ప్రాక్టిషినర్, మైక్రోసాఫ్ట్, అజురె ఏఈ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. ఉద్యోగ పరిజ్ఞానం, మానవవనరులపై వివరించారు. ఈ సందర్భంగా ఐసీటీ తెలుగు రాష్ట్రాల అధినేత గోపాల్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా దేశం నలుమూలలా ఇలాంటి శిబిరాలు నిర్వహించి లక్షలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 వేల మందికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించినట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థు లను గుర్తించి శిక్షణ శిబిరం నిర్వహించిన ఇన్ఫోసిస్ సంస్థకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీ సర్ టీ అషర్, కోఆర్డినేటర్ నీలిమ, సందీప్, డాలీ, అర్చన పాల్గొన్నారు

మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ చోరీ

దేవరుప్పుల, ఫిబ్రవరి 18: మండలంలోని నీర్మాలలో సోమవారం అర్ధ రాత్రి మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్ చోరీకి గురైంది. రైతులు ఇంటి మల్లారెడ్డి, మలిపెద్ది రాజశేఖర్‌రెడ్డి, కాడబోయిన కుమార్, మలిపెద్ది నవీ న్‌రెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాగా రైతులతో పాటు సింగరాజు పల్లి ఏఈ నర్సింహులు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల వ్యాప్తంగా ఈ సీజన్‌లో 10కి పైనే ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్ చోరీ జరిగింది. యాసంగి సీజన్ కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లలో వైర్ చోరీకి గురవడంతో విద్యుత్ లేక పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగలను గుర్తించడంతో పోలీసులు విఫలమవుతున్నా రని పలువురు ఆరోపించారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగితే విద్యుత్ శాఖకు రూ. లక్షల్లో నష్టం వాటిల్లుతోందని రైతులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్‌కు బదులు ప్రత్యామ్నాయాలు ఆలోచించి చోరీల నివారణకు చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ప్రముఖ వ్యాపారి అంజయ్య గుప్తా మృతి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 18 : జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ ఫర్టిలైజర్ వ్యాపారి చిట్టిమల్లె అంజయ్యగుప్తా(82) మంగళవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పుర ప్రముఖులు అంజయ్యగుప్తా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, బూడిద గోపి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దేవరుప్పుల, ఫిబ్రవరి 18: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నర్ర సోమయ్య(47) మంగళవారం ఉదయం స్నానం చేసిన అనంతరం దుస్తులను ఇనుప తీగ దండెంపై ఆరేస్తుండగా విద్యుత్‌షాక్ వచ్చి అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన భార్య మెయిన్ ఆఫ్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు ఇంటిపక్కన ఉన్న నర్ర రాధిక దండెను పట్టుకోగా షాక్ వచ్చింది. ఇంతలో కరెంట్ ఆఫ్ కావడంతో ఆమెకు ప్రాణా పాయం తప్పింది. మృతుడు నర్ర సోమయ్యకు భార్య మంజుల, కుమారులు ప్రవీణ్, ప్రశాంత్ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.